నమస్తే తెలంగాణ

జోగుళాంబ గద్వాల వనపర్తి

5 | మహబూబ్‌నగర్, మంగళవారం 30 ఏప్రిల్ 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY



విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల, చిత్రంలో ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్పీ

# మళ్లీ పాతరోజులొచ్చాయ్..

- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి
- ప్రజాసేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చా..
- బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- గట్టులో గులాబీ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం

గట్టు, ఏప్రిల్ 29 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో మళ్లీ పాతరోజులొచ్చాయని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. గట్టులో సోమవారం బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశానికి నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ప్రవీణ్‌కుమార్‌తో కలిసి హాజరై మాట్లాడారు. అధికారం చేపట్టి 138 రోజులు గడిచినా కాంగ్రెస్ పార్టీ ప్రజాభివృద్ధికి చేసేందేమీలేదన్నారు. ఒక్క పథకం కూడా అమలు కాలేదని విమర్శించారు. తెలంగాణకు అన్నం పెట్టిన బీఆర్ఎస్‌ను ఆదరించి ఎంపీగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజాసేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చినట్లు తేల్చిచెప్పారు. పోలీస్‌శాఖలో ఉన్నత పదవిని చేపట్టి గురుకులాల కార్యదర్శిగా పనిచేసి వందలాది విద్యార్థులను తీర్చిదిద్దానన్నారు. తనను గెలిపిస్తే జిల్లాతోపాటు గట్టు మండల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడతానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ్‌కుమార్, కేటీదొడ్డి జెడ్పీటీసీ రాజశేఖర్, పీఏసీసీఎస్ చైర్మన్ వెంకటేశ్, తాజా మాజీ సర్పంచ్ హనుమంతు, నాయకులు శ్రీధర్, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

## మోసపూరిత వాగ్దానాలు నమ్మొద్దు



కేసీఆర్ హయాంలోనే అన్ని వర్గాలకు లబ్ధి చేకూరిందన్న విషయాన్ని ప్రజలు గుర్తించుకోవాలి. గతంలో తాను గురుకులాల ముఖ్యకార్యదర్శిగా ఉన్నప్పుడు కేసీఆర్ సహకారంతో మారుమూల ప్రాంతాల్లోనూ పాఠశాలలను ఏర్పాటు చేశాం. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని కంప్యూటర్లను ఏర్పాటు చేసి విద్యను అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుంది. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఎంపీలు ఉంటేనే సాధ్యమవుతుంది. హైదరాబాద్‌కు ఎన్నో ఐటీ కంపెనీలను తీసుకొచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుంది. పదేండ్ల నిజానికి, వంద రోజుల అబద్ధానికి జరుగుతున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వైపు ప్రజలు నిలబడాలి. రేవంత్‌రెడ్డి వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేశాడు. ఇప్పటివరకు పూర్తిస్థాయిలో రైతుబంధు వేయలేదు. రుణమాఫీపై పూటకో మాట మాట్లాడుతున్నాడు. ఆగస్టు 15వరకు రుణమాఫీ చేస్తానని ఎక్కడ మీటింగ్ పెడితే అక్కడి దేవుళ్లపై ఒట్టు వేస్తూ మరోసారి ప్రజలను మోసం చేయడానికి చూస్తున్నాడు. ప్రజలు ఆ పార్టీని నమ్మే పరిస్థితి లేకపోవడంతోనే దేవుళ్లపై ఒట్లు వేసి ఓట్లు పొందాలని చూస్తున్నాడు. ఎవరు హామీలు నెరవేర్చారో.. ఎవరు విఫలమయ్యారో ప్రజలు ఆలోచించుకోవాలి. అటు కేంద్రం, ఇటు రాష్ట్రం ప్రజలను ముంచడంలో ప్రావీణ్యాన్ని సంపాదించుకున్నాయి. నడిగడ్డ బిడ్డనైన నన్ను పార్లమెంట్‌కు పంపిస్తే మీ సమస్యలు పరిష్కరిస్తాను.

**- ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి**

# కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలి

- బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు
- ఆర్ఎస్పీకి మద్దతుగా అచ్చంపేటలో ఇంటింటి ప్రచారం



అచ్చంపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు

అచ్చంపేట, ఏప్రిల్ 29: మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ఓటుతోనే బుద్ధిచెప్పాలని బీఆర్ఎస్ కందనూలు జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా సోమవారం పట్టణంలోని 12, 20వ వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నదని మారుతీనగర్ కాలనీవాసులు తెలిపారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా సమస్య లేదని, కాంగ్రెస్ వచ్చినప్పటి నుంచి నీళ్లకోసం గోస పడుతున్నామని మహిళలు వివరించారు. ఇండ్ల మీదుగా వేసిన కరెంటు తీగలను తొలగించాలని కోరగా.. గువ్వల వెంటనే ట్రాన్స్‌కో అధికారులకు ఫోన్ చేసి సమస్యను వివరించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెసోళ్ల మాటలకు మోసపోయి గెలిపించామని.. ఈసారి తప్పకుండా బీఆర్ఎస్‌కు ఓటేస్తామని ప్రజలు హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనతోపాటు కరువొచ్చింది.. ప్రభుత్వ పాలన ఇలాగే ఉంటుందని దుయ్యబట్టారు. వాస్తవ పరిస్థితులు ప్రజలకు ఇప్పుడే అర్థమవుతున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ మెడలు వంచాలంటే బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్పీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆరు గ్యారెంటీలను గాలికొదిలి మళ్లీ ఓట్ల కోసం వస్తున్న కాంగ్రెస్ నాయకులను ప్రజలు ఎక్కడికక్కడ నిలదీయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందని.. అందులో ఎలాంటి అనుమానం లేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహాగౌడ్, కౌన్సిలర్లు ఖాజా కుత్బుద్దీన్, రమేశ్‌రావు, అమీనుద్దీన్, సుంకరి బాలరాజు, శంకర్‌మాదిగ, అంతటి శివ, నిరంజన్, రాకేశ్, ఖాజా, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

# పులి దాడిలో ఆవు మృతి

- నక్కినోనిగండి ప్రాంతంలో ఘటన
- పరిశీలించిన అటవీశాఖ అధికారులు

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 29 : నల్లమల అటవీ ప్రాంతంలో నక్కినోనిగండి ప్రాంతంలో పులి దాడిలో ఆవు మృత్యువాత పడిన ఘటన సోమవారం వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే.. పెద్దకొత్తపల్లి మండలం మారెడుమాన్‌దిన్నె గ్రామానికి చెందిన సొప్పరి బాలయ్య తన పశువుల మందను మేత కోసం ఆదివారం నల్లమల అటవీ ప్రాంతానికి తీసుకెళ్లాడు. అయితే మందలో నుంచి ఓ ఆవు తప్పిపోయిన తన లేగదూడను వెతుకుతూ వెళ్తున్న సమయంలో నక్కినోనిగండి ప్రాంతంలో మాటుకాచి ఉన్న పెద్దపులి ఆవును హతమార్చింది. అయితే బాలయ్య తన ఆవు మృత్యువాత పడినట్లు గుర్తించాడు. ఆవు మెడ భాగంపై రక్తాన్ని పీల్చి ఆ తరువాత వెనకి భాగాన్ని చీల్చి తిన్నట్లు, ఇది పెద్ద పులి దాడే అని నిర్ధారణ చేసుకొని తిరిగి వచ్చాడు. ఈ మేరకు బాధితుడు సోమవారం లింగాల ఫారెస్ట్ అధికారులకు ఫిర్యాదు చేసి తనకు న్యాయం చేయాలని కోరారు. ఘటనా స్థలాన్ని ఫారెస్ట్ రేంజర్ వీరేశం, సిబ్బంది అక్కడికి చేరుకొని ఆవు కళేబరాన్ని పరిశీలించి పులి దాడిలోనే మృతి చెందినట్లు పంచనామా వివరాలు తీసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా బాలయ్యను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వానికి నివేదిక కూడా పంపనున్నట్లు తెలిపారు.



పులి దాడిలో మృతి చెందిన ఆవు కళేబరాన్ని పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారులు

- ఎంపీ ఎన్నికలకు ముగిసిన నామినేషన్ల ఘట్టం
- విత్‌డ్రా చేసుకున్న ఆరుగురు
- మహబూబ్‌నగర్‌లో 31, నాగర్‌కర్నూల్‌లో 19 మంది అభ్యర్థులు బరిలో..
- ప్రచారంలో ప్రధాన పార్టీల దూకుడు
- కాంగ్రెస్, బీజేపీకి తప్పని రెబల్స్ బెడద



# పోరులో 50 మంది

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ, ప్రతినిధి) : లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ముగిశాక ఊహించని విధంగా అభ్యర్థులు భారీ సంఖ్యలో బరిలో నిలిచారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రెండు పార్లమెంట్ స్థానాల్లో కలిపి 50 మంది అభ్యర్థులు పోరులో ఉన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో 31మంది, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో 19మంది అభ్యర్థులు ఫైనల్‌గా మిగిలారు. నామినేషన్ల ఉపసంహరణ చివరి రోజైన సోమవారం మహబూబ్‌నగర్ పార్లమెంటులో నలుగురు, నాగర్‌కర్నూల్‌లో ఇద్దరు ఇండిపెండెంట్ అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. అనంతరం ఎన్నికల రిటర్నింగ్ అధికారులు కేంద్ర ఎన్నికల సంఘం అబ్జర్వర్ల సమక్షంలో పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తులను కేటాయించారు. మహబూబ్‌నగర్ లోక్‌సభ పరిధిలో అత్యధికంగా 31మంది అభ్యర్థులు రంగంలో ఉండడం గమనార్హం. నాగర్‌కర్నూల్‌లోనూ ఈసారీ అభ్యర్థుల సంఖ్య పెరిగింది. స్వతంత్ర అభ్యర్థులను ప్రధాన పార్టీలు పట్టించుకోకపోవడంతో చాలా మంది ఉపసంహరించుకోవడానికి వెనుకాడారు. మరోవైపు కాంగ్రెస్, బీజేపీలకు రెండు పార్లమెంట్ పరిధిలో టికెట్లు ఆశించి అవకాశం దక్కని వారు రెబల్స్‌గా నామినేషన్లు వేశారు. వీరిని కూడా ఆయా పార్టీలు పట్టించుకోకపోవడంతో చివరగా పోటీలో నిలిచారు. ప్రధానంగా మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో ముక్కోణపు పోటీ అనివార్యమైంది. ఇక ఎన్నికలకు 14రోజులే సమయం ఉండడంతో అన్ని పార్టీలు ప్రచారంలో దూకుడు పెంచాయి.

***మహబూబ్‌నగర్ బరిలో 31 మంది..***

ఎన్నడూ లేనివిధంగా ఈసారి మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో మొత్తం 31 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. గతంలో నామినేషన్లు వేసిన స్వతంత్రులకు ఆయా పార్టీలు నయానో భయానో ఇచ్చి ఒప్పించి ఉపసంహరణ చేయించేవారు. కానీ ఈసారి సీన్ రివర్స్ అయింది. స్వతంత్రులను ఎవరూ పట్టించుకోకపోవడంతో వారంతా రంగంలో మిగిలారు. మరోవైపు మహబూబ్‌నగర్ లోక్‌సభ బరిలో బీఆర్ఎస్ తరపున మన్నె శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి వంశీచందర్‌రెడ్డి, బీజేపీ నుంచి డీకే అరుణ ప్రధాన పార్టీలనుంచి పోటీ చేస్తున్నారు. గత 2019 ఎన్నికల్లోనూ ఈ ముగ్గురే పోటీ పడ్డారు. బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి 70వేల పైచిలుకు మెజార్టీతో గెలుపొందారు. ఈసారి కూడా పాత ప్రత్యర్థులే రంగంలో మిగిలారు. దీంతో మహబూబ్‌నగర్ లోక్‌సభ ఎన్నికల చిత్రం రసవత్తరంగా మారింది. అయితే గెలుపుపై ప్రధాన పార్టీలు ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు.

***నాగర్‌కర్నూల్‌లో నువ్వా.. నేనా..***

నాగర్‌కర్నూల్ పరిధిలో ప్రధాన పార్టీల అభ్యర్థులతోపాటు 19 మంది రంగంలో మిగిలారు. నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానానికి బీఆర్ఎస్ అభ్యర్థిగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పోటీ చేస్తుండడంతో ఉత్కంఠంగా మారింది. మాజీ ఐపీఎస్ అధికారి ప్రవీణ్‌కుమార్ ఇదే పార్లమెంట్ పరిధిలోని అలంపూర్ నియోజకవర్గానికి చెందిన వ్యక్తి కావడం, ఇటీవలే బీఆర్ఎస్‌లో చేరడం, వెంటనే పార్టీ అధినేత కేసీఆర్ అభ్యర్థిగా బరిలో నిలపడంతో అందరి దృష్టి ఈ పార్లమెంట్‌పైనే ఉన్నది. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన మల్లు రవి ఘోరపరాజయం పాలయ్యారు. ఈసారి కూడా మళ్లీ పోటీ చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ రాములు కొడుకు భరత్ పోటీలో ఉన్నారు. వీరంతా నువ్వా.. నేనా అనే రీతిలో పోటీ పడుతుండగా.. మరో 16 మంది ఇండిపెండెంట్ అభ్యర్థులు కూడా రంగంలో ఉన్నారు.



## కేసీఆర్ రోడ్‌షోతో మారిన ముఖచిత్రం

తెలంగాణ స్వరాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ ఉమ్మడి పాలమూరు జిల్లాలో చేపట్టిన రోడ్‌షోతో పాలమూరు రాజకీయ ముఖచిత్రం ఒక్కసారిగా మారిపోయింది. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి సొంత జిల్లా అయిన పాలమూరులో పాగా వేసేందుకు ఆ పార్టీ అనేక ఎత్తులు వేస్తున్నది. ఇప్పటికే సీఎం హోదాలో నాలుగుసార్లు పార్టీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఇదంతా ఒక ఎత్తు అయితే కేసీఆర్ చేపట్టిన రోడ్‌షోతో పాలమూరు రాజకీయం మలుపు తిరిగింది. అధికారంలో ఉన్న పార్టీకి రానంత జనం కేసీఆర్ రోడ్‌షోలకు రావడంతో కాంగ్రెస్ పార్టీకి వణుకు పుట్టించింది. మహబూబ్‌నగర్‌లో సిట్టింగ్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, నాగర్‌కర్నూల్‌లో పార్టీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తరపున కేసీఆర్ స్వయంగా రంగంలో దిగడంతో పాలమూరు రాజకీయాలు పూర్తిగా మలుపు తిరిగాయి. బీఆర్ఎస్‌కు ప్రజాబలం ఇంకా ఉందని తేటతెల్లమైంది. ఇంకా జనం కేసీఆర్‌ను కోరుకుంటున్నారని రోడ్డు షోల్లో జనం స్పందన చూస్తేనే అర్థమవుతున్నది. అప్పటి వరకు జోరుమీదున్న కాంగ్రెస్, బీజేపీలు కూడా కారు దూకుడుతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. మరో వైపు మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్యేలు, నాగర్‌కర్నూల్‌లో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి తదితరులు అభ్యర్థుల గెలుపు బాధ్యతలు తీసుకున్నారు. ఎన్నికలు అయ్యే వరకు ప్రచారంలో దూకుడు పెంచాలని నిర్ణయించారు. దీంతో బీఆర్ఎస్ ప్రచారం ఊపందుకున్నది.

# బీఆర్ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి

- రైతులను పట్టించుకోని కాంగ్రెస్
- ప్రజలకోసం పరితపించే నాయకుడిని ఎన్నుకుందాం
- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి
- కేసీఆర్‌తోనే అన్ని వర్గాలకు ప్రాధాన్యం
- నిజానికి అబద్ధానికి మధ్య జరుగుతున్న ఎన్నికలు ఇవి
- బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- మల్దకల్, గట్టు, ధరూర్, కేటీదొడ్డిలో బీఆర్ఎస్ ప్రచారం
- గద్వాల మార్నింగ్ వాక్‌లో పాల్గొన్న ఆర్ఎస్పీ



గద్వాల మండలం గోనుపాడులో ఎమ్మెల్యే బండ్ల, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్పీని గజమాలతో సత్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



గద్వాల జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో కూరగాయల వ్యాపారిని ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్యే బండ్ల, చిత్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు

గద్వాల/గద్వాల రూరల్/మల్దకల్/కేటీదొడ్డి, ఏప్రిల్ 29 : బీఆర్ఎస్ హయాంలోనే తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మల్దకల్, గట్టు, ధరూర్, కేటీదొడ్డి, గద్వాల మండలంతోని గోన్‌పాడుతోపాటు జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ప్రవీణ్‌కుమార్‌తో కలిసి పార్లమెంట్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్దకల్ మండలం దాసరిపల్లిలో వెలసిన గ్రామ దేవత సవారమ్మ అవ్వను, కేటీదొడ్డి మండలం పాగుంట వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆర్ఎస్పీతో కలిసి ఎమ్మెల్యే పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే బండ్ల మాట్లాడుతూ.. ప్రజలకోసం పరితపించే నాయకుడిని ఎంపీగా గెలిపించుకొని నడిగడ్డను అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే విద్యుత్ కోతలు, తాగునీటి సమస్యలు తలెత్తాయన్నారు. సాగునీరు లేక పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు కావస్తున్నా రైతుల గురించి ఏనాడూ పట్టించుకోలేదని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో రైతులు వ్యవసాయాన్ని పండుగలా చేశారని గుర్తు చేశారు. కేసీఆర్ పాలనలో రైతులకు సకాలంలో రైతుబంధు, రుణమాఫీ, నిరంతరం కరెంట్ ఇచ్చేదన్నారు. ఈ సర్కారు రైతులను గాలికొదిలేసిందని, ట్యాంకర్లతో నీటిని తెచ్చుకొని కాపాడుకున్న పంటను కూడా కొనడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌కు చేరికలపై ఉన్న శ్రద్ధ రైతులపై లేదన్నారు. అందుకే ప్రజలందరూ కారు గుర్తుపై ఓటేసి బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించి.. కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రచారంలో భాగంగా గద్వాల మండలం గోనుపాడులో ఎమ్మెల్యేతోపాటు ఆర్ఎస్పీని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గజమాలతో సన్మానించి స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి వారు పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో, మార్కెట్ యార్డులో పర్యటించి ఓట్లు అభ్యర్థించారు. పోస్టాఫీస్ వద్ద దౌలత్ టీస్టాల్‌లో టీ చేసి ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ అధ్యక్షుడు రామన్‌గౌడ్, ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీలు ప్రభాకర్‌రెడ్డి, రాజశేఖర్, ఎంపీపీ మనోరమ, సింగిల్‌విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, కేటీదొడ్డి బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఉరుకుందు, సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, పటేల్ ప్రభాకర్‌రెడ్డి, సత్యారెడ్డి, వైస్ ఎంపీపీ పెద్ద వీరన్న, శ్రీధర్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, తూం కృష్ణారెడ్డి, నర్సింహారెడ్డి, భరత్, పెద్దపల్లి అజయ్, చంద్రశేఖర్‌రెడ్డి, నరేందర్, పరశురాముడు, మధుతోపాటు మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ఇంతియాజ్, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలకేంద్రంలో జరిగిన ప్రచార కార్యక్రమానికి హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు

# నిఘా నేత్రానికి చిక్కిన చిరుతలు

బిజినేపల్లి, ఏప్రిల్ 29 : మండలంలోని గంగారం, లట్టుపల్లి, మమ్మాయిపల్లిని ఆనుకొని ఉన్న అడవిలో చిరుతలు సంచరిస్తున్నాయని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. దీంతో అటవీశాఖ అధికారులు ఇటీవల అడవిలో సీసీ కెమెరా లు అమర్చారు. కాగా గంగారం అటవీ ప్రాంతంలోని నేరేడువంపు సమీపంలో, సోలార్ పంప్‌సెట్లు వద్ద నీటిని తాగుతూ మూడు చిరుతలు కెమెరాకు చిక్కాయి. నీటి కుంటల వద్ద సాంబారులు అనే అడవి జంతువు లు కూడా కనిపించాయి. అడవిలో చిరుతలు సంచరిస్తున్నాయని నిర్ధారణ కావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. త్వరలోనే చిరుతలను పట్టుకుంటామని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు.



గంగారం ఫారెస్ట్‌లో సీసీ కెమెరాకు చిక్కిన చిరుత

## బిజినేపల్లి @ 44.7 డిగ్రీలు

బిజినేపల్లి, ఏప్రిల్ 29 : ఎండలు తీవ్రతరం అవుతున్న తరుణంలో బిజినేపల్లి మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన టెంపరేచర్ కేంద్రం వద్ద గడిచిన 24గంటలలో 44.7డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఎక్కువ ఉష్ణోగ్రత ఇక్కడే నమోదైనట్లు అధికారులు తెలిపారు. కాగా మండలంలోని మంగనూర్ 40.6, పాలెంలో 41.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

## బస్సులు నిలిపేలా చర్యలు తీసుకుంటాం

- 'మహాలక్ష్మి'కి ఎన్ని తిప్పలో.. కథనానికి స్పందించిన ఆర్ఎం

నమస్తే ఎఫెక్ట్

లింగాల, ఏప్రిల్ 29 : 'నమస్తే తెలంగాణ' దినపత్రిక జిల్లా సంచికలో సోమవారం వెలువడిన 'మహాలక్ష్మికి ఎన్ని తిప్పలో' శీర్షికన ఆర్టీసీ మహబూబ్‌నగర్ రీజనల్ మేనేజర్ శ్రీదేవి స్పందించారు. ఆదివారం మండలంలోని కోమటికుంట, మాడాపూర్ గ్రామాలకు చెందిన మహిళలు లింగాల సంతకు వెళ్లేందుకు స్టేజీ వద్ద వేచి ఉండగా బస్సులు ఆపకపోవడంతో ఆందోళనకు దిగిన మహిళలు రోడ్డుకు అడ్డంగా రాళ్లు పెట్టారు. దీనిపై స్పందించిన ఆర్టీసీ ఆర్ఎం శ్రీదేవి మాట్లాడుతూ హైదరాబాద్, లింగాలకు ప్రతిరోజూ 12బస్సులు నడుతున్నామన్నారు. పల్లె వెలుగు బస్సులకు మాత్రమే స్టాప్ ఉందని పేర్కొన్నారు. అయితే ఎక్స్‌ప్రెస్ బస్సులకు స్టాప్ లేకపోయినా, ప్రయాణికులు ఉంటే బస్సులు ఆపాలని ఆర్టీసీ సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు ఆర్ఎం వెల్లడించారు.